క్లుప్తంగా

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

నేరడిగొండ: విత్తన నాణ్యత, విత్తన శుద్ధి తదితర అంశాలపై బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వానాకాలం పంటల సాగు గురించి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ పత్రాలు బహిర్గతం చేయాలి

బోథ్: బోథ్ మేజర్ గ్రామ పంచాయతీకి అద్దెకు పెట్టిన ట్రాక్టర్‌కు సంబంధించిన పత్రాలను బహిర్గతం చేయాలని స్థానిక నాయకుడు షేక్ నాజర్ అహ్మద్ మంగళవారం ఈవో అంజయ్యకు వినతిపత్రం అందించారు. ట్రాక్టర్‌కు సంబంధించి సరైన పత్రాలు లేదన్నారు. సరైన పత్రాలు లేకున్నా.. పంచాయతీ అధికారులు ఎలా అద్దెకు తీసుకున్నారని ప్రశ్నించారు.

కొనసాగుతున్న సప్తాహం



ప్రవచనలు చేస్తున్న సునీల్‌కుమార్ ఆష్టికర్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో గత ఆరు రోజుల నుంచి సప్తాహం కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సునీల్‌కుమార్ ఆష్టికర్ మహరాజ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, వారిని గౌరవించాలని కోరారు. మద్యపానం, మాంసహారాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు ప్రవచన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తుల హాజరవుతున్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌కు పంట విక్రయించేందుకు వచ్చిన రైతుల కష్టాలను తెలుసుకొని వారి ఆకలి తీర్చేందుకు పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్ యాదవ్, సంతోష్, లస్మన్న, వెంకన్న, రాందాస్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ బొంకంటి ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్‌తో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, అమర్‌సింగ వెంకటేశ మొయిన్, అరుణ్, గంగాధర్, వీణ, యశోద, రమ, దీప పాల్గొన్నారు.

15 వరకు డీఎడ్ పరీక్షకు దరఖాస్తు గడువు

ఆదిలాబాద్‌టౌన్: డీఎడ్ పరీక్ష కోసం ఈనెల 15 వరకు దరఖాస్తు గడువు ఉందని డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 17, 18 తేదీల్లో ఎడిట్ ఆప్షన్, 20 నుంచి హాల్‌టిక్కెట్ల జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 25న ఆన్‌లైన్‌లో పరీక్ష, జూన్ 5న ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 7 నుంచి 11 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 13 నుంచి 16 వరకు అభ్యర్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

పెళ్లి వేడుకపై తేనెటీగల దాడి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో మంగళవారం ఓ పెళ్లి వేడుకపై తేనెటీగలు దాడి చేశాయి. పెళ్లి వేడుకల్లో విందు సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయగా పెళ్లికి వచ్చిన బంధువులు పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో పలువురికి గాయాలయ్యాయి.

భానుడి భగభగ

ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేడిగాలులతో జనం సతమతం అవుతున్నారు. అత్యవసరంగా బయిటకు వెళ్లే ప్రజలు చేతి రుమాలు, టోపీలు ధరించి ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్ని నిర్మానుష్యంగా మారుతున్నాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





ఎండ నుంచి రక్షణగా తలకు వస్త్రం కట్టుకొని వెళ్తున్న వాహనదారులు



నిర్మానుష్యంగా ఎన్టీఆర్ చౌక్

పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



జైనథ్‌లో..

ఆదిలాబాద్‌రూరల్: పహల్గాంలో జరిగిన దాడి జిల్లా ప్రజలను భయాందోళనకు గురి చేసిందని, జిల్లాలో అనాధికారంగా నివాసం ఉంటున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ పౌరులను వెంటనే గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ బీజేపీ నాయకులు రెవేన్యూ అధికారులను కోరారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ డీటీ సాయి మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ జిల్లాలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన పౌరులు నివాసం ఉన్నట్లు తమకు అనుమానం ఉందన్నారు. అలాంటి వ్యక్తులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, రామన్న పాల్గొన్నారు.

రోహింగ్యాలను గుర్తించాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోనికి అక్రమంగా చొరబడిన రోహింగ్యాలను గుర్తించి ప్రభుత్వం వారిని వెంటనే వారి దేశానికి పంపించాలని బీజేపీ జైనథ్ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్ కోరారు. మంగళవారం జైనథ్ మండల కేంద్రంలో తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. చొరబడిన రోహింగ్యాలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే గుర్తించాలన్నారు. ప్రభుత్వం వెంటనే గుర్తించి వారి దేశాలు పంపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ నాయకులు వెంకన్న, సత్యనారాయణ, సురేశ్‌రెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

బేల: పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లను ఇక్కడి నుంచి తరలించాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్ రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్రశేఖర్, దత్తా నిక్కమ్, బోనిగిరి వార్ గణేష్, బొడకుంటి రాకేశ్, నవీన్, రాము, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: రాష్ట్రంలో ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను గుర్తించి వారిని వెంటనే వెనక్కి పంపాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్, గాదె శంకర్, గట్టు నారాయణ, బంటు ప్రవీణ్, కోట్నాక్ కోటేష్, రంజిత్, శ్రీధర్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

బజార్‌హత్నూర్: మండలంలో అన్ని గ్రామాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కమిటీ అధ్యక్షుడు జాదవ్ సుభాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గిర్నూర్ గ్రామంలో చాకలి గంగామణికి సొంత ఇల్లు లేదని, భర్త చనిపోయి ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తు నిరుపేద స్థితిలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హత ఉండి కూడా మంజూరు చేయలేదన్నారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో ఇందిరమ్మ కమిటీల సభ్యులు అర్హులను ఎంపిక చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలో అన్ని గ్రామపంచాయతీల లిస్టులను పరిశీలించి అనర్హులను తొలగించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న జాదవ్ సుభాష్

ఆదిలాబాద్: ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మాత్రమే కేటాయించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాహిల్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ఇందిరమ్మ కమిటీలలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని ఆరోపించారు. వితంతు మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అయితే ఇందిరమ్మ కమిటీల్లో ఉన్నవాళ్లు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం సరికాదన్నారు.

మంగళ గౌరీ రూపంలో అమ్మవారు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని పసుపు కొమ్ములతో అందంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళ గౌరీ రూపంలో కొలిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతర్ముఖ శక్తిని బహిర్గత పర్చేది విజ్ఞాన శాస్త్రమే

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్ముఖ శక్తిని బహిర్గత పర్చేది విజ్ఞాన శాస్త్రమేనని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా సమ్మర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పంట మార్పిడితో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత రాజశేఖర్

తలమడుగు: పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆదిలాబాద్ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా ఇతర పంటలు సాగు చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోళ్ల సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు మోహన్ దాస్, శివచరణ్, ప్రమోద్‌రెడ్డి, ఏఈవో కీర్తి, లావణ్య పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: వేసవిలో నర్సరీ మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడలో ఉపాధిహామీ నర్సరీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రతీ రోజు మూడు పూటలు నీటిని అందించాలన్నారు. గ్రీన్ మ్యాట్స్ పాడుకాకుండా చూడాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడాలన్నారు.

ఉదయం పూట పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

తలమడుగు: ఉపాధి పనులను ఉదయం మాత్రమే నిర్వహించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉండం గ్రామంలోని చెరువులో చేపడుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పనులను ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయమే చేయాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలన్నారు. పూడికతీత మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీవో మేఘమాల, ఈసీ ప్రవీణ్ రావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

జంగున్ బుయ్యారి పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి

ఇంద్రవెల్లి: మండలంలోని దొడంద గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఆదివాసీల ఆరాధ్య దైవం జంగున్ బుయ్యారి పుణ్యక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జంగున్ బుయ్యారి ఉత్సవ కమిటీ సభ్యులకు పిలిచి విద్యుత్ సరఫరకు సంబంధించిన పత్రాలు అందించారు. భక్తులకు సౌకర్యం కోసం విద్యుత్ సరఫరాకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తుంరం ప్రభత్‌రావ్ పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): సాత్నాల మండలంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సాత్నాల మండల కేంద్రంలో జొన్నలు కొనుగులు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ప్రతీ పంటను కొనుగోలు చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, రూకేష్ రెడ్డి, తహసీల్దార్ శ్యామ్‌రావు, దేవన్న పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే తీరుతో రైతులకు నష్టం'

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీరుతో పత్తి రైతులకు నష్టం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత కారణంగా పత్తి రైతులు నిలువున మోసపోయారని ఆరోపించారు. ఎమ్మెల్యే హస్తంతో ప్రైవేటీ డీలర్లతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని రైతులకు కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో మొత్తం 25లక్షల మంది పత్తి రైతులు సాగు చేసిన పత్తితో 49 లక్షల బేళ్లు ఉత్పత్తి అయ్యాయని గుణాంకాలు చెబుతున్నాయన్నారు. ఇందులో 41లక్షల బేళ్లు సీసీఐ ద్వారా ఖరీదు చేసినట్లు చెబుతున్నారని, మరో 8 లక్షల బేళ్లు ప్రైవేట్ వ్యాపారులతో కొనుగోలు చేయించినట్లు తెలిపారు. సీసీఐ కేవలం ఆరున్నర లక్షల మంది రైతుల నుంచే పత్తి కొనుగోలు చేసినట్లు ఉందన్నారు. దీపావళి రోజున హైదరాబాద్‌లో కాంగ్రెస్, ప్రైవేట్ వ్యాపారస్తులతో సమావేశమై రైతులను నిలువున మోసం చేసే ప్రయత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, అశోక్ స్వామి, తిరుపతి, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేద ప్రజలను మోసం చేస్తోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేద ప్రజలకు అండగా ఉన్నారని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో రూ. 1,00116 ఇవ్వడంతో పాటు తులం బంగారం ఇస్తామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని హామీతో ఇచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. అనంతరం లోకారి(కె) గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీపీ అడా రాజు, మాజీ వైఎస్ ఎంపీపీ యోగేష్, ఉర్వేత రూప్‌దేవ్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీఎంపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రజలపై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని దివాళ తీసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. 420 హామీలు ప్రకటించి ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు సాజిదొద్దిన్, సలీం పాషా, ఇజ్జగిరి అశోక్, కేమ శ్రీకాంత్, తిరుపతి, అథరుల్లా, విఠల్, దయానంద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

ఇంద్రవెల్లి: రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంత రైతులకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో సమావేశమయ్యారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు గర్భిణులు, బాలింతలకు పర్యవేక్షణ చేసి ఆరోగ్య వివరాలను తెలుసుకోవాలన్నారు. విధులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేశ్, వైద్య సిబ్బంది మణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గుడిహత్నూర్: విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన విత్తన డీలర్లు, ఏఈవోలకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేయడానికి కొనుగోలు చేసే ప్రతి విత్తన ప్యాకెట్ వివరాలు పొందుపర్చాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రతిరైతుకు రశీదు అందించాలన్నారు. డీలర్లు వారి సరుకును అనధికారిక గోదాముల్లో నిల్వలు ఉంచరాదని స్పష్టం చేశారు. ప్రతీ కొనుగోలు, విక్రయం డీలర్ల వద్ద ఉన్న రిజిష్టర్లలలో నమోదు చూపించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు ఏవో భగత్ రమేశ్, డీటీ ఆర్.భాగ్యలక్ష్మి, ఎస్ఐ మహేందర్, పీఎస్ఐ మధుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో రమేశ్

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రతీ రోజు రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, తదితర రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించి అవసరమైన ముఖ్య ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండాకాలంలో వేడి ద్వారా వచ్చే అనా రోగ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నా రు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, పూజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నరేందర్ రాథోడ్

గంజాయి విక్రేత అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన సచిన్ జైస్వాల్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. గంజాయి విక్రయిస్తూ పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొని రిమాండ్ తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.